క్లుప్తంగా

ఎంపీ బోస్ పరామర్శ

కాజులూరు: మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇటీవలే ఆసుపత్రి నుంచి డిచార్జ్ అయ్యి ఇంటికి వచ్చిన వైఎస్సార్ సీపీ మండల మహిళా కార్యదర్శి, గొల్లపాలెం ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవిని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్ చంద్రబోస్, ఆయన తనయుడు సూర్యప్రకాశ్ ఆదివారం పరామర్శించారు.

నేడు గొల్లపుంతలో గడప గడపకూ

మండపేట: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం మండపేట 16వ వార్డు గొల్లపుంతలో పర్యటించనున్నట్టు వైఎస్సార్ సీపీ కార్యాలయ కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గొల్లపుంత రామాలయం వద్ద నుంచి మొదలయ్యే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి

మండపేట: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించాలని బీసీ సంఘం నాయకుడు కోన సత్యనారాయణ తెలిపారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మంగళవారం ఉదయం స్థానిక టౌన్ హాలు వద్ద నుంచి భారీ మోటారు సైకిల్ ర్యాలీగా పెదకాలువ వంతెన వద్ద ఉన్న పూలే విగ్రహం వద్దకు చేరుకుని నివాళులర్పిస్తామన్నారు. అధిక సంఖ్యలో బీసీలు పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని కోరారు. సంఘ నాయకులు టీకి బీమరాజు, పంపన శ్రీనివాస్, పెంకే గంగాధర్, నరిగిరి కృష్ణ, విన్నకోట రాధాకృష్ణ, మల్లువలస గణపతిరావు, గోరు అన్నవరం, కోటిపల్లి కృష్ణ, చుక్కల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక సత్యసాయి సేవా మందిరంలో ఆదివారం ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం విశ్వనాథ హాస్పిటల్ ఆర్థోపెడిక్ డాక్టర్ సత్యవరపు రఘురామ్ వైద్య సేవలందించారు. ముందుగా బీపీ, బోన్ డెన్సిటీ పరీక్షలు చేశారు. అనంతరం కీళ్ల నొప్పులు, కీళ్లవాతం, స్పాండిలైటిస్, కండరాల నొప్పులు, నడుం నొప్పులు, సైటికాన్, సయాటికా తదితర నొప్పులకు సంబంధించి సుమారు 100 మంది పేషంట్లను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణమూర్తి, సమితి సభ్యులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఘనంగా గోగులమ్మ తీర్థం

రంగంపేట: పెదరాయవరం గ్రామంలోని గోగులమ్మ తల్లి వార్షిక తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తీర్థమహోత్సవం సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు విశేష ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా చేశారు. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి స్వరూపాలైన గరగలను గ్రామంలో ఇంటింటికీ ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చలివిడి, వడపప్పు, నైవేద్యం అమ్మవారికి సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మ్యూజిక్ బ్యాండు, కోలాటం, కోయనత్యం, బాణసంచాలతో తీర్థం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

స్వామి వార్ల సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



అయినవిల్లి విఘ్నేశ్వరుని చిత్రపటాన్ని హైకోర్టు జడ్జి చక్రవర్తికి అందజేస్తున్న ఆలయ చైర్మన్

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయన్నూ తొలుత ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన చక్రవర్తి దంపతులను వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. స్వామివారి చరిత్ర వివరించారు. ఆయన వెంట కొత్తపేట ఆర్డీఓ ముక్కంటి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వాడపల్లిలో..

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బొప్పన వరహలక్ష్మి నరసింహ చక్రవర్తి స్వామివార్ని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

మట్టి పరీక్షలు.. గట్టి లాభాలు..

- అధిక దిగుబడికి భూసార పరీక్షలు తప్పనిసరి
- నమూనాల సేకరణకు సిద్ధమైన అధికారులు



ద్రాక్షారామ భూసార కేంద్రంలో మట్టి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: నేల సారం బాగుంటే పంట దిగుబడి బాగుంటుంది. నేల నిస్సారమైతే ఎన్ని ఎరువులు వేసినా, ఎంత పెట్టుబడి పెట్టినా చేతికందే పంట అంతంత మాత్రమే.. దానిని అధికమించేందుకే ప్రభుత్వం భూసార పరీక్షలు చేయమంటోంది. పంట చేలకు వాడాల్సిన ఎరువుల మోతాదును నిర్ణయించేందుకు మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్ష ఫలితాలు విశ్లేషణ తప్పనిసరి చేయాలి. అందుకు ప్రతి రైతూ తమ చేలో మట్టి నమూనాలు పరీక్షలు విధిగా చేయించుకోవాలి. ఆ ఫలితాలు ఆధారంగా వ్యవసాయ అధికారులు ఎరువులు మోతాదును నిర్ణయిస్తారు. వ్యవసాయ శాఖ 2023–2024 సంవత్సరానికి మట్టి నమూనాలు సేకరణకు సన్నద్ధమవుతోంది. ఈ నెలలో వ్యవసాయ అధికారులకు జిల్లా స్థాయిలోనూ, ఆర్బీకే సిబ్బందికి మండల స్థాయిలోనూ ప్రత్యేక శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అనంతరం ప్రతి ఆర్బీకే పరిధిలోను సుమారు 100 వరకూ మట్టి నమూనాలను సేకరిస్తారు.

నమూనాలు సేకరించే విధానం

6.25 ఎకరాలు పరిధిని సర్వే నంబరు వారీగా గ్రిడ్‌గా నిర్ణయించి, సాగవుతున్న పంట వేరు లోతు వరకూ 'టీ' ఆకారంలో మట్టిని తొలగిస్తారు. ఆ లోతు అంచుల వెంబడి మెత్తటి మట్టిని గ్రిడ్ మొత్తంలో 19 నుంచి 12 చోట్ల సేకరించి శుభ్రమైన సంచిపై వేసి క్వార్టరింగ్ పద్ధతి ద్వారా నాలుగు సమ భాగాలుగా చేసి ఎదురెదురు భాగాలు తీసేసి అర కిలో మట్టి వచ్చే వరకూ అదే పద్ధతిలో చేయాలి. ఈ మట్టి నమూనాలు సేకరించేటప్పుడు భూ అక్షాంశ రేఖాంశాలు జీపీఎస్ విధానంలో నమోదు చేయాలి. దీంతో పాటు ఆధార్‌కు భూసార పరీక్షా ఫలితాలు అనుసంధానం చేయడం ద్వారా రానున్న ఖరీఫ్‌లో ఎరువులు సాయిల్ హెల్త్ కార్డులో సిఫారసు మేరకు రైతులు ఎరువులు కొనుగోలు చేసుకోవచ్చు.

సేకరించకూడని ప్రాంతాలివీ..

మట్టి నమూనాలు ఎక్కడ పడితే అక్కడ సేకరించకూడదు. చెట్ల నీడ ప్రాంతంలోనూ, నీరు పారే బోదెలు, ట్రాక్టర్ లేదా కోత యంత్రాల బాటల్లో, పెంటకుప్పలు, సేంద్రియ పదార్థాలు ఉండే చోట మట్టి నమూనాలు సేకరించకూడదు. అలాగే అధిక సారం ఉండే చోట కూడా నమూనాలు తీయకుండా సాధారణ పరిస్థితులు ఉండే చోట మాత్రమే సేకరించేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రతి రైతు భూమికి భూసార హెల్త్ కార్డు



వ్యవసాయ శాఖ నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ప్రతి మండలంలో ఈ మట్టి నమూనాలు సేకరించే కార్యక్రమం చేపట్టాం. ఆ మట్టి నమూనాలు తీసి భూసార పరీక్షలకు పంపిస్తాం. ఆ ఫలితాలను హెల్త్ కార్డు రూపంలో రైతుకు అందిస్తాం. దానిలో నిర్దేశించిన ప్రకారం ఎరువులు వాడితే చాలు. తెలిసీ తెలియక వాడే ఎక్కువ ఎరువుల సొమ్ము ఆదా అవుతుంది.

– ఎస్. సత్యప్రసాద్, మండల వ్యవసాయ అధికారి, రామచంద్రపురం

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వ్యవసాయ భూములు, ఆర్బీకేల వివరాలు..

మండలం	వ్యవసాయ భూమి (ఎకరాల్లో)	ఆర్బీకేలు
రామచంద్రపురం	18,121	21
కె.గంగవరం	15,678	23
కాజులూరు	18,149	23
మండపేట	16,555	24
రాయవరం	14651	19
కపిలేశ్వరపురం	15870	17

లీజుకు మండపేట కొత్త బస్టాండ్‌లో ఖాళీ స్థలం

రామచంద్రపురం రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ నూతనంగా ప్రవేశపెట్టిన ఓఎస్–15 పథకం పరిధిలో మండపేట కొత్త బస్టాండ్ ఆవరణలోని 3,640 చదరపు గజాల ఖాళీ స్థలం 15 సంవత్సరాల కాల పరిమితితో లీజుకు ఇవ్వడానికి టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ రామచంద్రపురం డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీన రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్ ఆవరణలో ప్రీ బిడ్ సమావేశం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 99592 25536 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

తాటాకిల్లు దగ్ధం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: గ్రామంలోని ఎస్సీ కాలనీ గొంతాలమ్మ ఆలయం సమీపంలో తిరుకోటి లక్ష్మికి చెందిన తాటాకిల్లు శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైంది. విషయం తెలుసుకున్న మండపేట అగ్నిమాపక దళం మంటలను ఆర్పే ప్రయత్నం చేసింది. రూ.1.90 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రెవెన్యూ సిబ్బంది బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 25 కేజీల బియ్యం అందజేశారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీ మేడిశెట్టి సత్యవేణి, ఎమ్మెల్సీ తోట తనయుడు తోట పృథ్వీరాజ్, సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీలు గొల్లపల్లి సోనియా, శీలం భాస్కరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి, పెద్దకాపు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వైద్య ఖర్చులకు విద్యార్థుల విరాళం



బాధిత యువతి తండ్రి బాషాకు విరాళం అందిస్తున్న విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న యువతికి విద్యార్థులు విరాళం అందించారు. రామచంద్రపురం పట్టణానికి చెందిన 26 ఏళ్ల మహమ్మద్ షకీరా భానుకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. కిడ్నీ ఇవ్వడానికి తల్లి వహీదా ముందుకు రావడంతో శస్త్ర చికిత్సకు రూ.6 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. యువతి తండ్రి బాషా కారు డ్రైవరుగా పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న కాపవరం యూపీ స్కూలు ఉపాధ్యాయుడు కుక్కల శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగలక్ష్మికి తెలియజేశారు. విషయం విద్యార్థులకు చెప్పడంతో వారు గ్రామస్తులతో పాటు ప్రజాప్రతినిధుల వద్ద రూ.20,240 విరాళాలు సేకరించి బాధిత యువతి తండ్రి బాషాకు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ రెడ్నం సతీష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మణిమాల పాల్గొన్నారు.

నేలటూరులో శెట్టి బలిజ సంఘం సమావేశం

కపిలేశ్వరపురం: మండల శెట్టిబలిజ సంఘం సమావేశం నేలటూరులో ఆదివారం సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి వాసు అధ్యక్షతన నిర్వహించారు. సంఘం పటిష్టతపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో సంఘం కార్యదర్శి వనుం పార్థసారథి, కోశాధికారి శీలం రాంబాబు, నాయకులు మేడిశెట్టి దుర్గారావు, కొప్పిశెట్టి రామ్‌కిశోర్, సర్పంచ్ కుక్కల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ గృహసారథులు

- గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు
- అభివృద్ధిపై ప్రజాభిప్రాయ సేకరణ



7, 8 వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో చైర్‌పర్సన్ దుర్గారాణి



ద్రాక్షారామలో స్టిక్కర్లు అందిస్తున్న వైఎస్ ఎంపీపీ రాజ్యలక్ష్మి, కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు



గొల్లపాలెంలో స్టిక్కర్ అతికిస్తున్న గృహసారథులు, పార్టీ నాయకులు



కపిలేశ్వరపురంలో గ్రామస్తులకు సంక్షేమ ఫలితాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మండపేట: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మూడో రోజు మండపేట, మండల గ్రామాల్లో ఉత్సాహంగా సాగింది. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆదివారం పలు ఇళ్లను సందర్శించి స్థానికులతో మమేకమయ్యారు. మండలంలోని కేశవరంలో ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ గృహసారథులతో కలిసి గ్రామంలో పర్యటించారు. వైఎస్సార్ ప్రభుత్వ పాలనకు గత టీడీపీ పాలనకు మధ్య వ్యత్యాసం గురించి ప్రజాభిప్రాయాన్ని నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారన్నారు. మెర్నిపాడులో సర్పంచ్ గారపాటి సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు, పాలతోడులో సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు అరవరాజు దంపతులు, మారేడుబాకలో సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు పలు ఇళ్లకు వెళ్లి ప్రజాభిప్రాయాన్ని నమోదు చేశారు. పట్టణంలోని 13వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, 28వ వార్డులో కౌన్సిలర్ మొండి భవాని, పార్టీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, గృహసారథులతో కలిసి వార్డులో పర్యటించి ప్రజాభిప్రాయం నమోదు చేసుకున్నారు. స్థానికుల కోరిక మేరకు సీఎం జగన్ వాల్ స్టిక్కర్లను స్థానికుల ఇళ్లకు అతికించారు. పట్టణంలోని 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, 7వ వార్డు ఇన్‌చార్జి మందపల్లి రుద్రకాంత్, 14వ వార్డు కౌన్సిలర్ శెట్టి కల్యాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆయా వార్డుల్లో పర్యటించారు. గృహసారథులు, పార్టీ నేతలతో కలిసి పలు ఇళ్లకు వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ప్రభుత్వం ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరించడంతో పాటు వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలర్లు కొవ్వాడ బేబీ, గ్రంధి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ కొడమంచిలి వేణు, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు మండలంలో..

కాజులూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో జగన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నాడు–నేడు ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ, ప్రజాభిప్రాయాలను సేకరించారు. స్టికర్లు, కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి మురళి, పార్టీ మండల బీసీసెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, సర్పంచ్‌లు పిల్లి కృష్ణమూర్తి, నెల్లి బ్రహ్మాజీ, కోమలి వెంకటరమణ, దండంగి సరోజిని, ఎంపీటీసీ సభ్యులు పద్మావెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా నీరాజం

కె.గంగవరం: ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో నవరత్నల ద్వారా అందించిన సంక్షేమ సమాచారాన్ని జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ఇంటింటికీ చేరవస్తామని ఏపీ ఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ అన్నారు. మండల పరిధిలోని అముజూరు, పామర్రు, యండగండి గ్రామాల్లో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లతో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమాన్ని వివరించి సర్వే వివరానలు నమోదు చేసుకుని స్టికర్లు అతికించారు. సర్పంచ్‌లు నానాపరపు కళ్యాణి, వాసంశెట్టి వెంకటదుర్గ, నాయకులు పెంకే రవిచంద్ర, నానాపరపు శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీను, సూరిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నూతనోత్తేజంతో..

రామచంద్రపురం రూరల్: గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నూతనోత్తేజంతో సాగుతోంది. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రత్యేక పర్యవేక్షణలో ప్రజాప్రతినిధులు, గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి గత తెలుగుదేశం పాలనలో రాష్ట్ర ప్రజలకు జరిగిన అన్యాయాలు వివరిస్తూ, సీఎం జగన్ పాలనలో మేలును గుర్తు చేస్తూ ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. ప్రజా మద్దతుతో వారి ఇంటిపై సీఎం జగన్ స్టిక్కర్‌ను అతికిస్తున్నారు.

పేద ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్‌సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. కపిలేశ్వరపురంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, లబ్ధిదారులకు కలిగిన ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొక్కా రాంబాబు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి, నాయకులు కొరిపెల్ల శ్రీనివాస్, అంగాని నూకరాజు, విజయ్, చింతా పెద్దకాపు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



అముజూరులోని మన్నా చర్చిలో కీర్తనలు పాడుతున్న చిన్నారులు

రామచంద్రపురం: క్రీస్తు పునరుత్థాన పండగ ఈస్టర్‌ను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శనివారం అర్ధ రాత్రి నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు క్రీస్తు శిలువ మరణానంతరం మూడో రోజున ఈస్టర్ పండగను జరుపుకొంటారు. ఈ సందర్భంగా క్రైస్తవ సమాధులను సుందరంగా అలంకరించి తెల్లవారు జామునే తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి నివాళులర్పించారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల ఆర్‌సీఎం చర్చిలో రెవరెండ్ ఫాదర్ అంతయ్య ఆధ్వర్యంలో ఈస్టను ఘనంగా నిర్వహించారు. భక్తిగీతాలు ఆలపించారు.

మండపేట: ఏసుక్రీస్తు శిలువ మోసి, మరణాన్ని జయించి మూడో రోజు సజీవునిగా సమాది నుంచి బయటకు వచ్చిన సందర్భంగా పునరుత్థాన పండగ (ఈస్టర్)ను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపేట అర్బన్, రూరల్‌లోని చర్చిల్లో ఉదయం నుంచి పండుగ వాతావరణం నెలకొంది. స్తుతి గీతాలను కీర్తించారు. అందరి ఇంట సుఖశాంతులు వెల్లివిరియాలంటూ ప్రార్థనలు నిర్వహించారు. మృతులైన వారి బంధువుల సమాధులను దర్శించి వారి స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రాయవరం: మండలంలోని ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారులు పాల్గొని మాట్లాడారు. కూర్మాపురంలోని జీవం గల దేవుని సంఘం చర్చి పాస్టర్ బిక్కి ఫ్రాన్సిస్ ప్రసంగిస్తూ శాంతి సమాధానం ఇవ్వడానికే ఏసుక్రీస్తు పునరుత్థానం జరిగిందన్నారు. గ్రామానికి చెందిన యడ్ల రామకృష్ణ, నిర్మల దంపతులు గ్రామంలోని ఐదు చర్చిలకు రూ.లక్ష వంతున విరాళంగా అందజేశారు. విరాళం అందజేసిన రామకృష్ణ, నిర్మల దంపతులను పాస్టర్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అలాగే భారీ అన్నదానం చేశారు. అనంతరం క్రైస్తవారాధకులకు బహుమతులు అందజేశారు. ఈస్టర్ వేడుకలను పురస్కరించుకుని పలు చర్చిల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

కె.గంగవరం: మండలంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. అముజూరులో మన్నా చర్చిలో నిర్వహించిన పండుగలో పాస్టర్ యం.జాన్‌బాబు మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమని, క్రైస్తవ విశ్వాసులు క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు .



పట్టణంలోని ప్రధాన రహదారిలోని సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఏడిదలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కూర్మాపురం చర్చిలో రామకృష్ణ, నిర్మల దంపతులను సత్కరిస్తున్న పాస్టర్ ఫ్రాన్సిస్, క్రైస్తవారాధకులు

స్వదేశీ దురాక్రమణను అరికట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

రామచంద్రపురం: బ్రిటీష్ పాలనలో గతంలో దేశం విదేశీ దురాక్రమణకు గురైతే ప్రస్తుతం స్వదేశీ దురాక్రమణకు గురవుతుందని, దానికి అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా ముందుకు రావాలని మాజీ శాసన మండలి సభ్యులు ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని చెలికాని రామారావు మెమోరియల్ హాల్‌లో ఆదివారం 'ఆర్థిక సంక్షోభం పర్యవసనాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెలికాని రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు మాజీ శాసన మండలి సభ్యులు శర్మ ప్రధాన వ్యక్తగా పాల్గొని ప్రసంగించారు. తొలుత సభలో పాల్గొన్న వారి ప్రశ్నలకు తగిన రీతిలో సమాధాలు ఇచ్చారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ దేశంలో ప్రతి అంగుళాన్ని తన సొంతం చేసుకోవడానికి ప్రధాన మోదీ మద్దతుతో అదానీ దేశంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. సహజ వనరులను లూటీ చేయడానికి అదాని కంపెనీ దేశంపై డేగలాగ వాలిపోయిందన్నారు. హిండెన్ బర్గ్ నివేదికతో దాని అసలు రంగు బయట పడిందని, దీంతో అదానీ కంపెనీ ప్రపంచ స్థాయిలో అప్రతిష్ట పాలై, దేశంలో ప్రభుత్వ రంగాన్ని కొల్లగొట్టిన మహా కుంభ కోణం బయట పడి ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ముందుకు వచ్చి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పెదపాటి నరసింహరావు అతిథులను సభావేదికపైకి ఆహ్వానించారు. నాయకులు చల్లా రవికుమార్, కెవివి సత్యనారాయణ, కేఎంఆర్ ప్రసాద్, ఈవీ సుబ్రహ్మణ్యం, ముమ్మిడి సత్యనారాయణ, డాక్టర్ చైతన్య శేఖర్, సీఐటీయూ నాయకులు బలరాం, ఏఐటీయూసీ నాయకులు పెద్దిరెడ్డి రాము, యూటీఎఫ్ నాయకులు దశరాజు, ఏపీ ఆచార్యులు, పీడీఎస్‌యూ నాయకులు బి.సిద్ధూ, ఈశ్వరరావు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు బజార్ ప్రారంభం

ఆలమూరు: గ్రామంలో సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన రైతు బజార్‌ను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సోమవారం ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ రైతుబజార్ వల్ల పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన కూరగాయలు సరసమైన ధరలకే లభ్యమవుతాయన్నారు. అలాగే పెనికేరులో ఉదయం ఏడు గంటల నుంచి రెండో విడత గడప గడపకూ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన సూచించారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి తీర్థోత్సవాల్లో మూడు వారాలు పూర్తవుతున్నా భక్తుల తాకిడి తగ్గడం లేదు. ఆదివారం సెలవు కావడంతో సుదూర, పరిసరాల ప్రాంతాల నుంచి విచ్చేసిన వేలాది మంది భక్తులతో క్యూలన్నీ కిక్కిరిసి పోయాయి. భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేశారు. ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతత్వంలో పోలీసులు బందోబస్తు కొనసాగిస్తున్నారు.